- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
19-05-2026

సంపుటి : 01 సంచిక : 58 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 58 NAMASTEY MAHAAPRABHA



### తుపాకీతో శాంతి రాదు..
## చర్చలతోనే సాధ్యం:

- రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలపై నార్వే వేదికగా ప్రధాని కీలక వ్యాఖ్యలు
- ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఓస్లో చేరుకున్న నరేంద్ర మోదీ
- భారత్ - నార్వే మధ్య కుదిరిన డిజిటల్ హెల్త్, 'ఏఐ' అవగాహనా ఒప్పందాలు
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో దేశంలోకి 100 బిలియన్ల పెట్టుబడులు, భారీగా ఉపాధి!

**న్యూఢిల్లీ 18 మే (మహాప్రభ)**

సైనిక ఘర్షణల వల్ల ఏ ఒక్క అంతర్జాతీయ సమస్యకూ శాశ్వత పరిష్కారం లభించదని, చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ప్రపంచంలో శాంతి స్థాపన సాధ్యమవుతుందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుండబద్దలు కొట్టారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా స్వీడన్ పర్యటన ముగించుకుని నార్వే చేరుకున్న ప్రధాని మోదీకి ఆ దేశ ప్రధాని జోనాస్ గర్ స్టోర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరు దేశాల అధినేతలు సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర అస్థిరత, అనిశ్చితిని ఎదుర్కొంటోందని, పశ్చిమాసియా సంక్షోభమైనా, ఉక్రెయిన్ యుద్ధమైనా తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు మద్దతుగా నిలిచిన నార్వేకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

-మిగతా 3 లో

### రణరంగంగా
# సిరిసిల్ల

### బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల ముష్టియుద్ధం

- పోలీసుల లాఠీచార్జ్!.
- కేటీఆర్, బండి సంజయ్ కు వ్యతిరేకంగా పోటాపోటీ ధర్నాలు, నినాదాలు
- చెప్పులతో దాడి- ముఖ్య నేతల బాహాబాహీ.. రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ
- ఇరు గ్రూపులను చెదరగొట్టి, భారీగా అరెస్టులు

**రాజన్నసిరిసిల్ల 18 మే (మహాప్రభ)**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సోమవారం రాజకీయ రణరంగంగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఒకే ప్రాంతంలో ఇరు పార్టీల వారు పోటాపోటీగా నిరసనలకు దిగడమే కాకుండా, పరస్పరం దాడులు, చెప్పుల విసురుకోవడాల వరకూ వెళ్లారు. దాంతో సిరిసిల్ల పాత బస్టాండ్ పరిసరాలు గందరగోళంగా మారాయి. పరిస్థితి అదుపు తప్పడంతో జిల్లా ఎస్పీ,

-మిగతా 3 లో





### కరీంనగర్ జిల్లాలో 50 శాతం
## ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రూ. 237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- రికార్డు స్థాయిలో వారంలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- రైతులకు ఇబ్బందులు రానివ్వం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ 18 మే (మహాప్రభ)**

కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చే వారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్దేశించ్నుమని, ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్

-మిగతా 3 లో

# రోడ్లపై నమాజ్ కుదరదు


### వినకుంటే మరో పద్ధతిలో చెబుతాం.. యూపీ సీఎం హెచ్చరిక


- రహదారులు రాకపోకల కోసమే.. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే ఒప్పుకోం
- మసీదుల్లో స్థలం లేకపోతే షిఫ్టుల వారీగా ప్రార్థనలు చేసుకోవాలి
- ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి..
- లక్నో బహిరంగ సభలో యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ 18 మే (మహాప్రభ)**

రోడ్లపై నమాజ్ చేసే విషయంలో ముస్లింలకు ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరిక జారీ చేశారు. యూపీలో ఇకపై రోడ్లపై నమాజ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్నోలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం యోగి పాల్గొన్నారు.

-మిగతా 3 లో





### స్మార్ట్‌ఫోన్ల మాయ..
## పడిపోతున్న జననాల రేటు!

- మానవ సంబంధాలను దూరం చేస్తున్న డిజిటల్ వేదికలు, సోషల్ మీడియా
- ముఖాముఖి సంభాషణలు కరువై.. భార్యాభర్తల మధ్య తగ్గుతున్న ప్రేమానుబంధం
- మూడు దశాబ్దాల క్రితం సగటున 3.4గా ఉన్న సంతానోత్పత్తి.. ఇప్పుడు 2కు పతనం
- హై-స్పీడ్ 4G ఇంటర్నెట్ వచ్చాకే తగ్గిన జననాలు..
- అంతర్జాతీయ అధ్యయనాల్లో వెల్లడి

**న్యూఢిల్లీ**

మన దేశంలో జనాభా కథ వేగంగా మారిపోతోంది. మూడు దశాబ్దాల క్రితం భారతీయ మహిళలు సగటున 3.4 మంది పిల్లలను కనేవారు. ప్రభుత్వ సర్వే గణాంకాల ప్రకారం ఇప్పుడు ఒక్కో మహిళ ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనిస్తోంది. వలసలు లేకుండా జనాభా తన పరిమాణాన్ని నిలుపుకోవాలంటే ఒక్కో మహిళ 2.1 మంది పిల్లలను కనాల్సి ఉంటుంది. వాస్తవానికి ఇది ఒక్క మన దేశానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో జననాల రేట్లు గణనీయంగా తగ్గి పోతున్నాయి. పలు దేశాలలో ఒక్కో మహిళ జన్మనిస్తున్న పిల్లల సంఖ్య ఇప్పుడు ఒకటి కంటే తక్కువగా ఉంటోంది. కొన్ని చోట్ల అయితే ఇది జీరోగా కూడా ఉండడం ఆందోళనకర పరిణామం.

-మిగతా 3 లో

# సతీశన్
# అనే నేను

### కేరళలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణ స్వీకారం**

- పదేళ్ల తర్వాత అధికార పీఠంపై యూడీఎఫ్
- రమేశ్ చెన్నితాలతో సహా 20 మంది మంత్రులుగా ప్రమాణం
- హాజరైన రాహుల్, ప్రియాంక, రేవంత్, ఖర్గే

**తిరువనంతపురం, 18 మే (మహాప్రభ)**

కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆరిఫ్ ఖాన్ ఆయనతో ప్రమాణం చేయించారు.

-మిగతా 3 లో






### పోక్సో కేసులో
## కీలక మలుపు

- బండి భగీరథ్‌కు జీవితఖైదు పడే సెక్షన్ నమోదు
- బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగిందన్న ఆరోపణలు
- ప్రత్యేక అధికారిగా డీసీపీ రితిరాజ్ దర్యాప్తులో కీలక విషయాలు
- నేరం రుజువైతే పదేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష పడే ఛాన్స్

ఏపీ, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్ట్ అయిన బండి భగీరథ్‌పై దర్యాప్తు అధికారులు కేసును మరింత తీవ్రతరం చేశారు. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) లోని 64(2)(వీ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే నిందితుడికి పదేళ్లకు పైగా జైలు శిక్ష, కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నెల 8వ తేదీన బాధితురాలైన మైనర్ పై లైంగిక వేధింపులు జరిగాయని ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పుడు, కేసు నమోదు విషయంలో పోలీసులు హైడ్రామా సృష్టించారని, బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు నిజం చెప్పకుండా ఒత్తిడి చేశారన్న విమర్శలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గత సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది.

3



### చైనాలో భారీ
## భూకంపం..


- గ్వాంగ్జీ రీజియన్‌లో రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రత నమోదు
- శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ల వృద్ధుడి ప్రాణాలు కాపాడిన రక్షక సిబ్బంది
- యుజౌ నగరంలో కూలిన భవనాలు.. 7 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- కొండచరియలు విరిగిపడి నిలిచిన రవాణా..
- భయంతో రోడ్లపైకి పరుగులు తీసిన జనం

**న్యూఢిల్లీ 18 మే (మహాప్రభ)**

చైనాలోని నైరుతి ప్రాంతమైన గ్వాంగ్జీ రీజియన్‌లో సోమవారం తెల్లవారుజామున సంభవించిన భారీ భూకంపం తీవ్ర కలకలం రేపింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.2గా నమోదైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా సంభవించిన వివిధ ప్రమాదాల్లో ఒక దంపతులు (63 ఏళ్ల పురుషుడు, 53 ఏళ్ల మహిళ) దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా ప్రభావితమైన లియుజౌ నగరం నుంచి సుమారు 7,000 మందికి పైగా నివాసితులను అధికారులు అత్యవసరంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భూకంపం ధాటికి లియుజౌలో పలు భవనాలు కుప్పకూలాయి. కొండచరియలు విరిగిపడటంతో

-మిగతా 3 లో

## డాలర్ ధాటికి రూపాయి విలవిల..



- రూ. 96.35కు పతనం!
- ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో సరికొత్త జీవితకాల కనిష్టానికి దేశీయ కరెన్సీ
- ఒకే రోజు 54 పైసలు క్షీణత..
- ఒక దశలో 96.39 మార్కును తాకిన విలువ
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదలతో మార్కెట్లలో తీవ్ర ఒత్తిడి
- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణే రూపాయి పతనానికి ప్రధాన కారణం

3

## సౌదీలో పాక్ సేనల మోహరింపు!



- ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ రంగంలోకి పాకిస్తాన్
- రక్షణగా 8వేల మంది సైనికులు, 16 యుద్ధ విమానాలు
- చైనాతో కలిసి తయారు చేసిన 'జేఎఫ్--17' స్క్వాడ్రన్ సిద్ధం
- ఒకవైపు శాంతి చర్చల మధ్యవర్తిత్వం.. మరోవైపు సైనిక సాయం!

3

## జిఆర్ కరుణాకర్ పార్థివ దేహానికి నివాళులర్పించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.



**గడ్డి అన్నారం 18 మే (మహాప్రభ)**
భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, గరుడు గట్టిన జాతీయవాది జి ఆర్ కరుణాకర్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ఉదయం రాగన్న గూడలోని వారి నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. జి ఆర్ కరుణాకర్ రాజకీయాల్లో నీతి, నిజాయితీ, విలువలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. పార్టీ బలోపేతానికి, జాతీయవాద సిద్ధాంతాల ప్రచారానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సాధారణ కార్యకర్తలతో సైతం ఆప్యాయంగా మెలిగే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అనేక సంవత్సరాల పాటు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన కరుణాకర్ సేవలను బీజేపీ ఎప్పటికీ మరు వదన్నారు. నిబద్ధతతో కూడిన ఆయన రాజకీయ జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే ధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు

## తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నిరసన





**కరీంనగర్, మే 18 మహాప్రభ**
భగీరథ్ ఫోక్సో కేసు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ, కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా చేపట్టారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.బాధితురాలికి న్యాయం చేయాలి, చట్టం ముందు అందరూ సమానమే అంటూ నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది. రవీందర్ సింగ్ మాట్లాడుతూ మైనర్ బాలిక కేసులో కేంద్ర మంత్రి పేరు రావడం బాధాకరమని, నిష్పాక్షిక దర్యాప్తు జరగాలంటే ఆయన వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.నాయకులు మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, రాజకీయ ప్రభావాలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ ధర్నా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



**పెద్దపల్లి,మే 18 మహాప్రభ**
దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఏఎల్ఐఎంసిఓ సంస్థ ఆధ్వర్యంలో, సమగ్ర శిక్ష మరియు జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, సహాయ ఉపకరణాలు వారి దైనందిన జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ క్యాంప్‌లో 75 మంది దివ్యాంగులకు 94 ఉపకరణాలు అందజేశారు. వీటిలో ట్రైసైకిళ్లు, సీపీ చెయిర్లు, టీఎల్ఎం కిట్లు, విజువల్ ఇంపెయర్డ్ కిట్, వీల్ చెయిర్లు, హియరింగ్ ఎయిడ్స్, రోలేటర్ ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శారద, సీఎంఓ కవిత, కోఆర్డినేటర్ మల్లేష్, హెడ్‌మాస్టర్ అరుణ, అన్ని మండలాల ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.దివ్యాంగుల స్వావలంబనకు ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందని కలెక్టర్ శ్రీహర్ష స్పష్టం చేశారు.

## కాలనీ మొత్తం దుమ్ము



**ఎల్బీనగర్, మే 18 మహాప్రభ**
ఎల్బీనగర్ మాన్సూరబాద్ డివిజన్ లో సరస్వతి నగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా బోరు వేస్తున్నారు. ఎండాకాలంలో బోర్ పర్మిషన్ ఎవరు ఇవ్వరు.. కాలనీ మొత్తం దుమ్ము లేపుతున్నారు ఇలాంటి జాగ్రత్తలు లేకుండా అధికారులు స్పందించి దుమ్ము రాకుండా చూడాలని కాలనీవాసులు ఆరోపించారు.

## రామాయంపేట పిఎసిఎస్ నిధుల దుర్వినియోగంలో బాధ్యులపై చర్యలేవి







**-జీవో 44 తుంగలో తొక్కిన అక్రమ నియమకాలు**
**-3,66,55,859 రూపాయల రికవరీ ఉన్నట్ల లేనట్లా**

**రామాయంపేట మే 18 మహాప్రభ**
రామాయంపేట వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో మూడు కోట్ల 66 లక్షల రూపాయల నిధుల దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నిధులు రికవరీ కి జిల్లా యంత్రాంగం ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నా రాణి నిధులు రికవరీ చేస్తారా లేదా అని రామాయంపేట మండల పరిధిలోని ప్రజలు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తుంది . రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పాలకవర్గం నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ పాలకవర్గానికి సంబంధించిన డైరెక్టర్లు. జిల్లా కోపరేటివ్ అధికారి ఫిర్యాదు చేయగా 2023. 2024 లో రామాయంపేట ప్రథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించిన లెక్కలను ఎంక్వయిరీ ఆడిట్ ఆఫీసర్లు తుకారం నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ చేసి నట్లు తెలుస్తుంది దీనిపై ప్రాథమిక విచారణ కోసం జిల్లా యంత్రాంగం ఎంక్వైరీ ఆఫీసర్ గా పాయాజుద్దీన్ ను నియమించినట్లు తెలిసింది
ప్రాథమిక విచారణలో రామాయంపేట పిఎసిఎస్ లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి డిస్టిక్ కో ఆపరేటివ్ ఈ ఆఫీసర్ కు పంపించినట్లు తెలిసింది అక్టోబర్ 60 తెలంగాణకు ఆపరేట్ చట్టం 1964 అనుసరించి జిల్లా కోపరేట్ ఆఫీసర్ రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో జరిగిన నిధుల దుర్వినియోగం పై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్న ట్లు తెలుస్తుంది జీవో నెంబర్ 44

**తుంగలో తొక్కి ఉద్యోగ నియామకాల;**
రామాయంపేట ప్రాథమిక వ్యవసాయక పరపతి సహకార సంఘం లో జీవో నెంబర్ 44 ప్రకారం ఒక సీఈఓ ఆడిటర్ ముగ్గురు సూపర్వైజర్ విధులు నిర్వర్తిస్తుండగా జీవో నెంబర్ 44 ను కాదని ప్రస్తుత పాలకవర్గంలో లక్షల రూపాయల డబ్బులు దండుకొని అదనంగా మరో నలుగురిని వీధిలోకి తీసుకొని ఉద్యోగ బాధ్యతలు అప్పజెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి దీనిపై కూడా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు అవినీతికి పాల్పడ్డ పాలక వర్గం కె తిరిగి బాధ్యతల? రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులను దుర్వినియోగం చేసిన పాలకవర్గంపై విచారణ కొనసాగించాలని నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న పాలకవర్గానికి తిరిగి బాధ్యతలు ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు జిల్లా వ్యాప్తంగా కొన్ని సొసైటీలలో అక్రమాలు జరుగుతున్న పత్రికలలో కథనాలు వస్తున్నప్పటికీ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు ప్రజాధనం పక్క త్రోవన పడుతున్న జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నా రాణి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అలాగే రామాయంపేటలో వైస్ చైర్మన్ పదవులు లేకుండా ఫ్లెక్సీలు రామాయంపేటలో అలజడి సృష్టిస్తున్నాయి పాలకవర్గంలోని కొందరు ఇష్టానుసారంగా ఫ్లెక్సీ లలో ఏర్పాట్లపై సంఘ సభ్యులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు అలాగే నిధుల దుర్వినియోగానికి పాల్పా డా పాలకవర్గంపై చర్యలు తీసుకుని విధులు రికవరీ చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని సంఘ సభ్యులు కోరుకుంటున్నారు. అలాగే కొందరు జీవో 44 కు విరుద్ధంగా సొసైటీలో అక్రమ నియామ కాలను చేపడుతున్నట్టు సొసైటీ సంఘ సభ్యులు వాపోతున్నారు . ఇలాంటి సంఘటనలు పునర్వృతం కాకుండా పై ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తామని వారు ఆరోపించారు. అలాగే సొసైటీ పాలక మండలి వారిని విచారించకుండానే ఇష్టానుసారంగా వారు వ్యవహరిస్తున్నారని. ఫ్లెక్సీలలో ఇష్టం వచ్చిన టూ గా పదవులు పెట్టుకుంటున్నారని సంఘ సభ్యులు వారు ఆరోపించారు

## రోడెక్కిన అన్నదాత.. లారీలు రాక.. ధాన్యం పోక..

**-లారీలు రాక ధాన్యం తరలక.**



**పాపన్నపేట, మే18( మహాప్రభ )**
ధాన్యం తరలించేందుకు లారీలు ఏర్పాటు చేయడం లేదని సోమవారం మండల పరిధిలోని మిన్పూర్ రైతులు రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మెదక్-బోడుమటపల్లి రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ధాన్యం తరలింపులో వాహనాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం అయ్యారని, వాతావరణం మార్పులతో అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకు పోతుండగా, వాటిని తరలించేందుకు అవసరమైన లారీలు అందుబాటులో లేక రైతులు రోడెక్కే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి ధాన్యం తూకం కాకపోవడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రాత్రింబవళ్లు అక్కడే కాపలా కాస్తున్నామన్నారు. తుకం పూర్తయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో కొత్తగా వచ్చిన ధాన్యానికి స్థలం లేక కేంద్రాలు కిక్కిరిసిపోయాయని వాపోయారు. లారీలు సరిపడా ఏర్పాటు చేయడంలో అధికారుల వైఫల్యం కారణంగా సమస్య మరింత తీవ్రమైందని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీలు, వాహనాల కొరతగా ఉండటంతో లోడింగ్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, ధాన్యం తరలించిన లారీలు మిల్లులలో ధాన్యం బస్తాలు దింపుకోవడం లేదని దీంతో ఒక్కో మిల్లు వద్ద పదుల సంఖ్యలో లారీలు ధాన్యం బస్తాలతో రెండు, మూడు రోజులపాటు నిలిచిపోతుండడంతో లారీల కొరత ఏర్పడిందని, నిర్వాహకులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు ససేమిరా అంటూ భీష్మించి కూర్చుండడంతో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ రైతులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా రోడ్డుపై బైఠాయించడంతో స్థానిక తహసిల్దార్ కు ఎస్ఐ ఫోన్ లో తెలపడంతో లారీలు కేంద్రానికి సమకూర్చుతానని తెలపడంతో శాంతించిన రైతులు నిరసనను విరమించారు.

## మే 22న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం



**సిద్ధిపేట, మే 18 మహాప్రభ**
జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యమని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి సమావేశాలు విజయవంతంగా పూర్తయ్యాయని, ఇప్పుడు మే 22న జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు త్రాగునీరు, కూర్చునే సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.సమావేశ ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు బీమా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, సన్న వడ్ల ప్రోత్సాహకం, ఆసరా పింఛన్లు వంటి పథకాల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. లబ్ధిదారులను సమావేశంలో పాల్గొనించి వారి అనుభవాలను ప్రజలతో పంచుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్ఓ నాగరాజమ్మతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.మే 22న జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం జరగనుంది.లిలి

## ధాన్యం కొనుగోళ్లలో రికార్డు




**కరీంనగర్, మే 18 మహాప్రభ**
జిల్లాలో 50 శాతం వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.237 కోట్లు జమయ్యాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి కొనుగోలు జరుగుతోందని, ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని, అందులో 1.58 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు.వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగిందని, వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. హమాలీల సమస్యను స్థానికంగా పరిష్కరించి, లారీ రవాణా సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల విషయంలోనూ కరీంనగర్ రాష్ట్రంలో ముందంజలో ఉందని, 78 శాతం ఆన్లైన్ నమోదు పూర్తయిందని, 88 శాతం ధాన్యం మిల్లర్లు స్వీకరించారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# రోడ్లపై నమాజ్ కుదరదు

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లను బ్లాక్ చేసి, నమాజ్ చేయడం సరికాదని సూచించారు. చట్టం అందరికీ సమానమే అన్నారు. అందరూ నన్ను అడుగుతుంటారు. ఉత్తర ప్రదేశ్‌లో ప్రజలు రోడ్లపై నమాజ్ చేయరా అని. అలాంటిది ఇక్కడ ఉండదని చెబుతుంటా. కావాలంటే వెళ్లి చూడమని చెబతా. రోడ్లు ఉన్నవి రవాణా కోసం. ఎవరైనా రోడ్ల మీదకు వచ్చి ట్రాఫిక్ అడ్డుకోవాలని చూశారా..? ఇబ్బంది పెట్టారా..? రోడ్లపై ప్రజలు వెళ్లకుండా అడ్డుకునే హక్కు ఎవరికైనా ఉందా..? కొంతమంతి అడుగుతుంటారు.. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అని. మీ ఇంట్లో అంత స్థలం లేకపోతే.. దానికి అనుగుణంగా జనాభా తగ్గించుకోండి. అనవసరంగా జనాభా పెరగడాన్ని తగ్గించుకోవాలి. ప్రభుత్వ నిబంధన అంటే.. అది చట్టమే. అది అందరికీ సమానంగా వర్తిస్తుంది. నమాజ్ తప్పనిసరి. కానీ, మీ షిఫ్టుకు అనుగుణంగా చేసుకోండి. మేం ఆపం. కానీ, రోడ్లపై నమాజ్ చేయొద్దు" అంటూ యోగి వ్యాఖ్యానించారు.ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలని సూచించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో పర్యటన సందర్భంగా కూడా యోగి ఆదిత్యనాథ్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. కానీ, వాటిని టీఎంసీ పార్టీ ఖండించింది. ఇక, సీఎం యోగి తాజా వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# స్మార్ట్‌ఫోన్ల మాయ.. పడిపోతున్న జననాల రేటు!

మొదటి తరువాయి

**సాంకేతికత వినియోగంతో క్షీణిస్తున్న సంబంధాలు**

సంతానోత్పత్తి రేటు పడిపోవడానికి నిపుణులు అనేక కారణాలు చూపు తున్నారు. పెరుగుతున్న జీవనవ్యయం, ఆలస్యంగా జరుగుతున్న వివాహాలు, వృత్తిపరమైన ఒత్తిడులు, మారుతున్న సామాజిక నియమాలు వంటి అందిరికీ తెలిసిన కారణాలను ప్రస్తావిస్తున్నారు. ఇవి నిజమే అయినప్పటికీ కొందరు పరిశోధకులు స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ వేదికల వైపు వేలెత్తి చూపుతుండడం గమనార్హం. సాంకేతికతను వినియోగించుకోవడం ఎక్కువవుతున్న కొద్దీ మానవ సం బంధా లు క్షీణిస్తున్నాయి. ఇది సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రభావం చూపుతోంది. సిన్సినాటీ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నాథన్ హడ్సన్, హెర్నన్ మాస్కోసో-బోడో ఓ అధ్యయనాన్ని నిర్వహించారు. అమెరికా, బ్రిటన్ దేశాలలో అందుబాటులోకి వచ్చిన 4జీ మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యం జననాల రేటుపై చూపుతున్న ప్రభావాన్ని వారు పరిశీలించారు. హై-స్పీడ్ మొబైల్ కనెక్టివిటీ కలిగిన ప్రాం తాలలో జననాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడాన్ని గమనించారు.

**పలుకే బంగార మాయెరా...**

స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో లేనప్పుడు కుటుంబ సభ్యులు... ముఖ్యంగా భార్యాభర్తల మధ్య సంభాషణలు ఎక్కువగా జరుగు తుండేవి. అవి వారి మధ్య ప్రేమానుబంధాన్ని పెంచేవి. స్మార్ట్‌ఫోన్లు రావడంతో పరిస్థితి మారిపోయింది. పలుకే బంగార మాయెరా అన్న చందంగా తయారైంది. ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లోనే కాలం గడిచిపోతోంది. ముఖాముఖి మాట్లాడు కునే సందర్భాలే అరుదైపోతున్నాయి. ఈ ధోరణి కేవలం అమెరికా, బ్రిటన్‌కే పరిమితం కాలేదు. స్మార్ట్‌ఫోన్లు విస్తృతంగా అందు బాటులోకి వచ్చిన సమయంలోనే అనేక దేశాలలో జననాల రేటు పడిపోవడం మొదలైందని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక విశ్లేషణలో తేలింది.

**ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా**

అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలలో 2000వ సంవత్సరంలోనూ, ఆ తర్వాత టీనేజర్లు, యువతలో జననాల రేటు సాపేక్షంగా స్థిరంగానే ఉంది. అయితే 2007 తర్వాత....అంటే స్మార్ట్‌ఫోన్లు, మొబైల్ యాప్‌లు వంటివి వెల్లువలా వచ్చి పడడంతో ఆ రేటు గణనీయంగా పడిపోయింది. చిన్న వయసు వారిలో సంతానోత్పత్తి రేటు తగ్గుదల మరింత తీవ్రంగా ఉంటోంది. అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లు వినియోగించేది వీరే కావడం విశేషం. దీనికితోడు మానవ సంబంధాలపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉంటోంది. యువత ఎక్కువగా సామాజిక మాధ్యమ వేదికలకు అతు క్కుపోతుండడంతో వారిలో లైంగిక సామర్థ్యం క్షీణిస్తోంది. వైవాహిక జీవితంపై ఆసక్తి కలగడం లేదు. మానవ సంబంధాలు దీర్ఘకాలం కొనసాగకపోవడానికి సోషల్ మీడియాయే కారణమని కొందరు శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. సామాజిక మాధ్యమ వేదికలు యువత జీవన శైలిని మార్చేస్తున్నాయి. ఆర్థిక పరంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. సామాజిక పోలికలను సృష్టిస్తున్నాయి. దీంతో యువతలో అభద్రత, అస్థిరత నెలకొంటోంది.

# పోక్సో కేసులో కీలక మలుపు

మొదటి తరువాయి

**డీసీపీ రితిరాజ్ ప్రత్యేక దర్యాప్తు..**

వెంటనే రంగంలోకి దిగిన డీసీపీ రితిరాజ్, గత సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంలో స్పష్టత లేదని గుర్తించి, దర్యాప్తును లోతుగా చేపట్టారు. గత మంగళవారం డీసీపీ స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, ఆమెతో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడారు. పోక్సో కేసుల దర్యాప్తు నిబంధనల ప్రకారం, ఆమె నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. బాధితురాలు చెప్పిన విషయాలకు, పోలీసులు మొదట నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని గ్రహించారు.

# చైనాలో భారీ భూకంపం..

మొదటి తరువాయి

రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ల వృద్ధుడిని రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసింది. గాయపడిన మరో నలుగురిని ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ 'జిన్హువా' వెల్లడించింది. కాగా, గల్లంతైన వారి కోసం ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# తుపాకీతో శాంతి రాదు.. చర్చలతోనే సాధ్యం:

మొదటి తరువాయి

**పదేళ్లలో రెండింతలైన వ్యాపారం.. కుదిరిన కీలక ఒప్పందాలు:**

భారత్-యూరప్ దేశాల మధ్య గతంలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చారిత్రాత్మకమైనదని, దీని ద్వారా భారత్‌కు దాదాపు 100 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులతో పాటు యువతకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. తాజా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య డిజిటల్ హెల్త్, రీసెర్చ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , హెల్త్ టెక్నాలజీ వంటి రంగాల్లో కీలక అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. గత పదేళ్లలో రెండు దేశాల మధ్య వాణిజ్యం రెండింతలు పెరిగిందని, రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ, సీఫుడ్, ఇన్నోవేషన్ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని మోదీ వివరించారు.

# సతీశన్ అనే నేను

మొదటి తరువాయి



కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే.మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌కు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కునాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

**రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం**

కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. "పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శు భదినం. ప్రజలకు సుపరిపాలన అందించడమే మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను" అని ఆయన తెలిపారు.

**స్పష్టమైన ఆధిక్యంతో యూడీఎఫ్ విజయం**

ఈ నెల 4వ తేదీన వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో యూడీఎఫ్ కూటమి అద్భుత విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను యూడీఎఫ్ 106 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63, దాని ప్రధాన మిత్రపక్షానికి 22 సీట్లు దక్కాయి. మరోవైపు, అధికారంలో ఉన్న వామపక్ష కూటమి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కేవలం 35 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయం చవిచూసింది. సీపీఎం 26, సీపీఐ 8 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న చివరి రాష్ట్రమైన కేరళలో కూడా అధికారం కోల్పోవడం గమనార్హం.

# డాలర్ ధాటికి రూపాయి విలవిల..

**-రూ. 96.35కు పతనం!**
**- ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో సరికొత్త జీవితకాల కనిష్టానికి దేశీయ కరెన్సీ**
**- ఒకే రోజు 54 పైసలు క్షీణత..**
**- ఒక దశలో 96.39 మార్కును తాకిన విలువ**
**- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదలతో మార్కెట్లలో తీవ్ర ఒత్తిడి**
**- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణే రూపాయి పతనానికి ప్రధాన కారణం**



**న్యూఢిల్లీ**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు పతనాన్ని చవిచూసింది. ముడి చమురు ధరలు విపరీతంగా ఎగబాకడం, గ్లోబల్ మార్కెట్లలో అమెరికా డాలర్ బాగా బలోపేతం కావడంతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో భారతీయ రూపాయి ఏకంగా 54 పైసలు క్షీణించి 96.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 96.19 వద్ద బలహీనంగా ఓపెన్ అయిన కరెన్సీ, ఒక దశలో అత్యంత కనిష్టంగా 96.39 మార్కును తాకింది. గడిచిన శుక్రవారం రూపాయి విలువ 95.81 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

**రూపాయిపై ఒత్తిడికి కారణాలివే:**

అమెరికా--ఇరాన్ మధ్య నిరంతరాయంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఫారెక్స్ వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. చమురు ధరలు పెరగడం వల్ల భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి డాలర్లు బయటకు వెళ్లడం భారీగా పెరిగింది. దీనికి తోడు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు సైతం భారత మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటూ డాలర్లను వెనక్కి తీసుకెళ్తుండటం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. అమెరికా ట్రెజరీ బాండ్ల ఆదాయం పెరగడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగుతుండటంతో రాబోయే రోజుల్లో కూడా రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సౌదీలో పాక్ సేనల మోహరింపు!

**- ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ రంగంలోకి పాకిస్తాన్**
**- రక్షణగా 8వేల మంది సైనికులు, 16 యుద్ధ విమానాలు**
**- చైనాతో కలిసి తయారు చేసిన 'జేఎఫ్--17' స్క్వాడ్రన్ సిద్ధం**
**-ఒకవైపు శాంతి చర్చల మధ్యవర్తిత్వం.. మరోవైపు సైనిక సాయం!**



**న్యూఢిల్లీ**

ఇరాన్--అమెరికా యుద్ధ సమయంలో పాకిస్తాన్ వైఖరి అనేక అనుమానాలకు తావిచ్చింది. సౌదీ అరేబియాలో పాకిస్తాన్ భారీ సైన్యాన్ని మోహరించినట్లు తాజాగా వెల్లడైంది. అంతేకాదు.. సౌదీ అరేబియాకు రక్షణగా 16 యుద్ధ విమానాల్ని కూడా పాక్ అందుబాటులో ఉంచినట్లు తేలింది. ఈ విషయాన్ని పాక్, సౌదీ అరేబియాకు చెందిన సైనిక ఉన్నతాధికారులు వెల్లడించారు.అయితే, అధికారికంగా మాత్రం కాదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సౌదీ అరేబియాకు పాకిస్తాన్ 8,000 ట్రూపుల్ని, స్క్వాడ్రన్ యుద్ధ విమానాల్ని పంపించింది. ఒకవేళ మళ్లీ సౌదీ అరేబియాపై దాడి జరిగితే స్పందించేందుకు పాక్ సైనికులతోపాటు, యుద్ధ విమానాలు కూడా సిద్ధంగా ఉంచారు. చైనాతో కలిసి తయారు చేసిన జేఎఫ్--17 అనే 16 యుద్ధ విమానాల్ని పాక్.. సౌదీలో మోహరించింది. అవసరమైతే మరింతమంది సైన్యాన్ని, యుద్ధ విమానాల్ని కూడా పంపిస్తామని సౌదీకి తెలిపింది. పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య ఏడాది క్రితం రక్షణ ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించిన స్పష్టమైన విధి విధానాలు తెలియవు. కానీ, సైనిక పరంగా అవసరమైనప్పుడు ఒకదానికి ఒకటి సహకరించుకోవాలన్నది ప్రధాన ఒప్పందం. ఎందుకంటే సౌదీ అరేబియా వద్ద సొంత సైన్యం, యుద్ధ విమానాలు పెద్దగా లేవు. అందువల్ల ఈ విషయంలో పాక్ సాయం అడిగింది. సౌదీకి ఎప్పుడు అవసరమైనా.. పాక్ సైనిక సాయం అందించాలి. పాకిస్తాన్‌కు అవసరమైనప్పుడు కూడా సౌదీ సాయపడాలి. ఇక, తాజాగా సౌదీలో పాక్ సైనిక మోహరింపుపై ఇటు పాక్.. అటు సౌదీ అధికారికంగా మాత్రం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇటీవల సౌదీపై ఇరాన్ పలుసార్లు దాడులకు దిగింది. ఇదే సమయంలో సౌదీ కూడా ఇరాన్‌పై దాడులకు పాల్పడింది. కానీ, దీనిపై ఇరాన్ నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. పాకిస్తాన్ ఒకవైపు ఇరాన్--అమెరికా మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తూనే.. ఇరాన్‌కు వ్యతిరేకంగా సౌదీలో తన సైన్యాన్ని మోహరించడం ఇక్కడ విశేషం.

# రణరంగంగా సిరిసిల్ల

మొదటి తరువాయి

డీఎస్పీ రంగంలోకి దిగిం లాఠీచార్జి చేసి ఇరు గ్రూపులను చెదరగొట్టారు. బాలిక అంశంలో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ ను తక్షణమే మంత్రివర్గం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలపడానికి పోలీసుల అనుమతి తీసుకున్నారు. అనంతరం పాత బస్టాండ్ ప్రాంతంలోని నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో ధర్నాకు దిగారు. బండి సంజయ్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ఆయన్ను బర్తరఫ్ చేయాలని, బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి ?కౌంటర్‌గా.. గతంలో ?22 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన కేటీఆర్‌ను శిక్షించాలని, గ్లోబరీనా సంస్థపై 'సిట్' ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు సైతం అదే సమయంలో నేతన్న చౌక్‌కు చేరుకుని ధర్నాకు ఉపక్రమించాయి.

**నేతన్న చౌక్ వద్ద ఉద్రిక్తత.. చెప్పుల వర్షం**

ఒకే వేదిక (నేతన్న చౌక్) సమీపంలో ఇరుపార్టీల శ్రేణులు భారీగా మోహరించడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ శ్రేణులు 'బండి సంజయ్ డౌన్ డౌన్' అంటూ, బీజేపీ శ్రేణులు 'కేటీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎదురెదురుగా నిలబడి గొంతు చించుకున్నారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి, పరస్పర దాడులకు దారితీసింది. నేతలు, కార్యకర్తలు బాహాబాహీకి దిగి ముష్టియుద్ధం చేసుకున్నారు. ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో నేతన్న చౌక్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి.

**రంగంలోకి పోలీస్ బాస్.. లాఠీచార్జి, అరెస్టులు**

జిల్లా ఎస్పీ మహేష్ బిగితే, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అదనపు బలగాలతో రంగప్రవేశం చేశారు. ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల వారిని వారించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. మొదట బీజేపీ శ్రేణులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు కలెక్టరేట్ సమీపంలో బండి సంజయ్ భారీ ఫ్లెక్సీతో మరోసారి ధర్నాకు దిగారు. అక్కడ కూడా ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన బీఆర్ఎస్ నాయకుల్లో నాఫ్స్‌క్యాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి, పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులు అరెస్టయ్యారు. ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీసులు భారీగా మోహరించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.?

# కరీంనగర్ జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

మొదటి తరువాయి

అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. వచ్చిన ధాన్యం నుండి ఒక లక్ష 58 వేల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని, రైతులకు ఇందుకు సంబంధించి 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికతో



ఉన్నామని అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ సజావుగా సాగేలా చూడాలని తెలిపారు. రానున్న రెండు వారాలు మరింత కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీల సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమించాలని మంత్రి సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారులు ఇచ్చామని, లారీ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# సంపాదకీయం

## అ'నిర్ధారిత- భాష



దేశ యువకులను, సమాచార హక్కు కార్యకర్తలను "బొద్దింకలు, పరాన్న జీవులు" అని అభివర్ణించారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి. మరుసటి రోజు ఆయన వివరణ ఇచ్చినప్పటికీ...ఆయన మాటలు జనం మదిలోంచి చెరిగిపోయే అవకాశం లేదు. అంతటి అత్యున్నత న్యాయపీఠంపై ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి చౌకబారు మాటలు అసలు ఊహించలేం. ఆ విపరీత వ్యాఖ్యలకు శుక్రవారం సుప్రీంకోర్టు మౌనసాక్ష్యంగా నిలిచింది. దేశ భవిష్యత్తుకు వెన్నెముకగా నిలిచే యువతను, వారి హక్కుల కోసం పోరాడే శక్తులను అత్యున్నత పీఠాలపై కూర్చున్నవారు చూసే విధానానికి ఈ మధ్యకాలంలో వస్తున్న ఇలాంటి వ్యాఖ్యలే నిదర్శనం. ఒక న్యాయవాది తనకు సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు ఇవ్వకపోవడాన్నికి ప్రశ్నిస్తూ దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తావనకు వచ్చినప్పుడు సీజేఐ వ్యవస్థ మీద నోరు పారేసుకున్నారు. "ఏ ఉద్యోగమూ దొరకని బొద్దింకల్లాంటి యువకులు ఉన్నారు. వీరిలో కొందరు మీడియాలో దూరతారు. కొంతమంది సామాజిక మాధ్యమాలలో ఏవో రాస్తుంటారు. కొందరు సమాచారహక్కు (ఆర్టీఐ)కార్యకర్తల అవతారం ఎత్తుతారు. వారు అందరినీ తప్పు పడ్తుంటారు" అని ప్రశ్నించే వారందరినీ బొద్దింకలు అనేశారు. ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా ఉండాల్సిన న్యాయవ్యవస్థ ఉన్నత పీఠాలపై కూర్చున్న కొందరు వ్యక్తులు, పెట్టుబడిదారీ వర్గాల భాషను, ఫ్యూడల్ అహంకారాన్ని ప్రదర్శించడం దేశంలో పెరుగుతున్న సామాజిక అసమానతలకు, అణచివేత ధోరణికి అద్దం పడుతోంది. వీరు ఉపయోగించే భాష, చేసే వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలుగా మిగిలిపోవు. అవి సమాజంపై, ముఖ్యంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతరంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చారిత్రకంగా శ్రామికవర్గం, విద్యార్థి లోకం, యువత సాగించే పోరాటాలను అణచివేయడానికి పాలకవర్గాలు ఎప్పుడూ ఒక నిర్ధారితమైన భాషను, అణచివేత ధోరణిని ఉపయోగిస్తూనే ఉంటాయి. నేడు దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరింది. చదువుకున్న యువతకు ఉపాధి లేదు, కార్మిక చట్టాలు నీరుగారిపోతున్నాయి, విద్యావ్యవస్థ వ్యాపారీకరణ చెందుతోంది. ఇలాంటి సంక్షోభ సమయాల్లో యువత వీధుల్లోకి వచ్చి తమ హక్కుల కోసం, ఉపాధి కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం గొంత్తెత్తుతోంది. యువత ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సంక్షోభాలకు పరిష్కారం చూపాల్సింది పోయి, వారి ఆవేదనలను, నిరసనలను క్రమశిక్షణా రాహిత్యంగా ప్రధాన న్యాయమూర్తి చిత్రీకరించడం ఎంత శోచనీయం! సమాజంలో వ్యవస్థను ప్రశ్నించేవారిని అమానవీయమైన పదాలతో సంబోధించడం అనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. భారత ప్రజలకు సమాచార హక్కు అనేది పార్లమెంటు ఉదారంగా ఇచ్చిన వరం కాదు. అది రాజ్యాంగం కల్పించిన భరోసా' అని సుప్రీంకోర్టే గతంలో చరిత్రాత్మక తీర్పులు వెలువరించింది. కానీ, నేడు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ...చట్టాన్ని అమలు చేయాల్సిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తే సమాచార హక్కు కార్యకర్తలపై వ్యాఖ్యలు చేయడాన్ని ఏమనాలి? ఈ వాస్తవిక పరిస్థితుల్లో సమాచార హక్కు నీరుగారిపోతోందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. పౌరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే హక్కు ఏ వ్యవస్థకూ లేదు. కోర్టుల్లో ప్రజాస్వామిక విలువలు, కార్మిక-శ్రామిక వర్గాల పట్ల గౌరవం పెంపొందేలా తగిన సంస్కరణలు చేపట్టాలి. అహంకార పూరిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. భారత న్యాయవ్యవస్థ తక్షణమే ఈ ఫ్యూడల్ మనస్తత్వం నుండి బయటపడాలి. న్యాయమూర్తులు తాము పాలకులం కాదని, రాజ్యాంగానికి లోబడి పనిచేసే సేవకులమని గుర్తించాలి. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పుడు వాటిని సరిదిద్దడానికి విమర్శలు అవసరమే కావచ్చు, కానీ ఆ విమర్శ యువతను సన్మార్గంలో పెట్టేలా, వారిని ప్రోత్సహించేలా ఉండాలి కానీ వారి ఆత్మగౌరవాన్ని, సామాజిక స్పృహను దెబ్బతీసేలా ఉండకూడదు. యువతరం తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు, వారిని అభినందించాల్సింది పోయి అవమానించడం అంటే వ్యవస్థ తన సొంత భవిష్యత్తును తాను తిరస్కరించుకోవడమే. న్యాయవ్యవస్థ అయినా, కార్యనిర్వాహక వ్యవస్థ అయినా రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను, సమానత్వాన్ని కాపాడాలి. యువతను కించపరిచే విధంగా, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా సాగే ఎలాంటి వ్యాఖ్యలైనా ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటివి. యువతరం అనేది ఒక దేశానికి కేవలం జనాభా మాత్రమే కాదు, అది ఆ దేశ ప్రగతికి చోదక శక్తి. ఈ సమాజాన్ని నడిపించే చైతన్య రథసారథులు. చరిత్రలో ఏ విప్లవమైనా, మార్పైనా యువతరం త్యాగాలు, పోరాటాల ద్వారానే సాధ్యపడింది. పాలకుల, ఉన్నతాధికారుల అహంకారపూరిత వ్యాఖ్యలు యువత చైతన్యాన్ని ఆపలేవు. ఇప్పటికైనా పాలకవర్గాలు తమ శైలిని మార్చుకుని, యువతకు కావలసిన ఉపాధి, హక్కులు, గౌరవాన్ని అందించడంపై దృష్టి పెట్టాలి. యువతను కేవలం ఒక 'సమస్య'గా చూడటం మానేసి, వారిని దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే నేటి అవసరం. అత్యున్నత స్థానాల్లో ఉన్నవారు యువత ఆవేదనను, వారి నిరసనల్లోని న్యాయాన్ని అర్థం చేసుకుని, మరింత సంయమనంతో, గౌరవప్రదమైన భాషతో సంబోధించినప్పుడే ప్రజాస్వామ్య విలువలు కాపాడబడతాయి. యువతను కించపరిచేలా సాగే ఎలాంటి వ్యాఖ్యలైనా ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఎంతమాత్రం సమర్థనీయం కావు.

# పెంచిన పెట్రోల్ ధరల పై వైఎస్ఆర్సీపీ పోరుబాట..

**- ఆర్డీవోకు వినతిపత్రం అందజేత**
**-పక్క రాష్ట్రంలో రూ. 103 ఉంటే.. ఇక్కడ రూ. 113 ఎందుకు?**
**-- నాడు సెల్ఫీలు దిగిన బాబు, పవన్ నేడు ఎక్కడ?**
**-సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు.. రెండేళ్లలోనే రూ. 3.56 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజం.**






**మే 18 తిరుపతి జిల్లా (సూళ్లూరుపేట) మహాప్రభ** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా.. ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని, రాష్ట్రంలో ఒక్క సంక్షేమ పథకం కూడా సక్రమంగా అమలు చేసిన ఆనవాలు లేవని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్ ధరల విపరీత పెంపును నిరసిస్తూ సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో భారీ 'పోరుబాట' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

**అప్పుల పాలనపై నిలదీత:**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ చేసిన అప్పు రూ. 3.3 లక్షల కోట్లు అయితే, ఈ ఉమ్మడి కూటమి ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే రూ. 3,56,455 లక్షల కోట్లు భారీ అప్పులు చేసిందని గణాంకాలతో సహా నిలదీశారు. ఎన్నికల ముందు రాష్ట్రం శ్రీలంకలా మారుతోందని విమర్శించి, అధికారంలోకి వచ్చాక సంపద సృష్టించి ప్రజలకు పంచుతామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

**పెట్రో భారం.. సామాన్యుడిపై దెబ్బ**

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించిందని సంజీవయ్య ఆరోపించారు. పక్క రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 103 ఉంటే, మన రాష్ట్రంలో రూ. 113 ఎందుకు ఉందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రంలో రోజుకు డీజిల్ పై రూ. 3 కోట్లు, పెట్రోల్ పై రూ. 6 కోట్ల చొప్పున ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెట్రో ధరలపై సెల్ఫీ ఛాలెంజ్‌లు విసిరిన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు.. ఇప్పుడు సామాన్యుడు అల్లాడుతుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, అక్రమాలు, దోపిడీలు మాత్రమే జరుగుతున్నాయని.. వీటన్నింటినీ గమనిస్తున్న ప్రజలు 2029 ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ భారీ నిరసన పోరుబాట కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ ముఖ్య నేతలు అల్లూరు అనిల్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, అర్ముగం, జెట్టి వేణు యాదవ్ లతో పాటు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల వైఎస్ఆర్సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.

# ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ హైపర్ టెన్షన్ డే....

**తూప్రాన్ మే 18 (మహాప్రభ )**

మెదక్ జిల్లా తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అధిక రక్తపోటు దినోత్సవ ర్యాలీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ జనేశ్వర్ డిప్యూటీ డిఎంహెచ్వో పిఓ ఎన్ సి డి మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొత్తం 30 సంవత్సరాలు పైబడిన వారు 3,86,83 మంది ఉండగా అందులో అధిక రక్తపోటు వార 1,07,999 మరియు 53,995 మంది మధుమేహం (చక్కర వ్యాధితో) బాధపడుతూ ఉన్నారు. అందులో 70% వారికి వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల మన జిల్లాలో మొత్తం 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 3 సామాజిక ఆరోగ్య కేంద్రాలు

ఒక జిల్లా ఆసుపత్రితో పాటు గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు ఉచితంగా మందులు అందజేస్తున్నామని ఆయన అన్నారు పిహెసిలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది మిగిలిన 30% కూడా




ప్రభుత్వ పరిధిలో చికిత్స అందించే ప్రయత్నం చేస్తున్నాము వీటితోపాటు ప్రతి ఒక్కరు వారి జీవనశైలి మార్చుకోవాలి అనగా యోగ మెడిటేషన్ తో పాటు ధూమపానం మద్యపానం నాకు దూరంగా ఉండటం జంక్ ఫుడ్ కూడా చాలావరకు నివారించుకోవచ్చును మరియు 14 - 15 సంవత్సరాల వయసు బాలికలకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా గర్భశయ ముఖ ద్వారానికి క్యాన్సర్ (సర్వికల్) రాకుండా హెచ్పీవీవ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. దీన్ని ప్రతి బాలిక వ్యాక్సినేషన్ చేయించుకొని సర్వికల్ క్యాన్సర్ బారిన పడకుండా నివారించుకుందాం.అని అయన పేర్కొన్నారు సిహెచ్ సి సూపరిడెంట్ అమర్ సింగ్ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకి రాకూడదని ఆయన సూచించారు అవసరముంది వెళ్లినచో తలను కాటన్ బట్టతో కవర్ చేసుకొని ఉండాలని ఆయన కోరారు అన్ని సిహెచ్ పిహెచ్సిలో సబ్ సెంటర్లో ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో ఉన్నదని తెలియజేశారు సమావేశంలో పీహెచ్సీ మనోహరాబాద్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కే బాల నర్సయ్య డిప్యూటీ డి ఎం హెచ్ ఓ స్టాఫ్ సిహెచ్ సి స్టాప్ అందరు పాల్గొనడం జరిగింది.

# లారీల కొరతతో ధాన్యం తరలింపులో జాప్యం.

**-ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం..**
**-మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి.**

**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ )**

వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో వడ్ల కుప్పలు పేరుకుపోతున్నాయని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, లారీల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిజాంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో రైతులు రోజులు తరబడి ధాన్యం వద్దే కాపలా కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోనె సంచులు, సుత్తిల్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో కేంద్రాల్లో వడ్ల కుప్పలు పేరుకుపోతున్నాయని అన్నారు. వర్షాలు పడితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.వడ్ల కొనుగోలు విషయంలో ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన



ప్రభుత్వం బాధ్యతను అధికారులపై నెట్టేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పంట కొనుగోలు బాధ్యతను పూర్తిగా కలెక్టర్లు, అధికారులపై వేస్తున్నారని, మంత్రులు, ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లే కొనుగోలు కేంద్రాల్లో జాప్యం ఏర్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో రైతులు పండించిన ప్రతి గింజను సకాలంలో కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేశామని గుర్తుచేశారు. రైతుబంధు, రైతు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు మళ్లీ కష్టాల్లోకి నెట్టబడ్డారని ఆరోపించారు. రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేసి, ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ మైనర్ బాలిక వేధింపుల కేసులో ప్రభుత్వం ఆలస్యంగా స్పందించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ పోరాటాల కారణంగానే 10 రోజుల తర్వాత ప్రభుత్వం స్పందించి అరెస్టు చేసిందన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కోరారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్లు బాదే. చంద్రం, బాపురెడ్డి, సదాశివలింగం,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, మాజీ సర్పంచ్ బజాజ్ తిరుమల గౌడ్, రంజిత్ గౌడ్, చిన్న తిరుమల్ గౌడ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, బొప్పారం రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వ పథకాల పై పూర్తి అవగాహన కల్పించాలి

-రైతు సంక్షేమం కోసం మనమంతా కలిసి పనిచేదం రైతు ఆశలను నేరవేర్చే విదంగా ఆత్మ కమిటీని ఆదర్శవంతంగా తీర్చుదిద్దుదాం....

-ఆత్మ కమిటీ నియోజకవర్గ చైర్మన్ పూజల గోపికృష్ణ

**సిద్దిపేట మే 18,(మహా ప్రభ)**
నేడు సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ మొదటి సమావేశం కార్యాలయంలో నిర్వహించారు..ఈ సందర్భంగా మొదటగా అధికారులు నూతనంగా ఎన్నికైన గోపికృష్ణ,ను స్వాగతం పలుకుతూ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో పూజల గోపికృష్ణ, అధికారులను డైరెక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆత్మ కమిటీ అనేది రైతుల అభివృద్ధి కోసం పనిచేసే ఒక ముఖ్యమైన వేదిక. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ప్రభుత్వ పథకాలను ప్రతి రైతుకు చేరవేయడం. ఆధునిక వ్యవసాయం పద్ధతులపై అవగాహన కల్పించడం ప్రధాన బాధ్యత అని వివరించారు. ప్రతి గ్రామంలో



రైతు సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని కోరారు పంటల పై అవగాహన కార్యక్రమాలు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని కోరారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు .ఎరువులు సమయానికి అందేలా చూడాలి అని కోరారు.రైతు వేదికలను మరింత చురుకుగా నిర్వహించి రైతుల అభిప్రాయం లు తెలుసుకోవాలి అన్నారు. రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది గ్రామం బాగుంటే రాష్ట్ర అభివృద్ధి చెందుతుంది అని చెప్పారు. మరియు పంట నష్టాల సమయంలో రైతులకు సాయం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ సందర్భంగా అధికారులు కూడా డైరెక్టర్ లకు సూచనలు ఇవ్వటం జరిగింది..ఈ కార్యక్రమం లో ఆత్మ డైరెక్షర్లు పులగుర్ల రజిత, గణపురం సంతోషి, ఉమాదేవి, అఖిల, గూడెపు దేవలక్ష్మి, ఆ బాకీ సంగీత, బత్తుల స్రవంతి, ముతకాని పోచవ్వ, అదే రెడ్డి బాలయ్య, ఐరేని అంజిరెడ్డి, బొజ్జ రాజకుమార్, ఆడపు లక్ష్మీనారాయణ, మహమ్మద్ అజ్మత్ అలీ,సీత బాలు, బందెల కనకయ్య, మద్దూరి ఎల్లయ్య, ఎర్ర శ్రవణ్, నరాల బాబు, ఎర్రోళ్ల బాబు,, రాచకొండ కనకయ్య, ప్రశాంత్, గూడెంపు శ్రీనివాస్, శివరాత్రి తిరుపతి, పి వెంకటేష్,ఆత్మ అధికారులు వై. పద్మ ఏడీఏబి. శ్రీనాథ్ సిద్దిపేట అర్బన్ ఏఓఎం. నరేష్ సిద్దిపేట రూరల్ ఏఓబి. పరుశు రాంనారాయణరావుపేట ఏఓఎ. జయంత్ కుమార్ చిన్నకోడూర్ ఏఓవి. గీత నంగునూర్ ఏఓఎన్. శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్భవాని ప్రసాద్ బీటీఎంతదితరులు పాల్గొన్నారు

# వ్యాయామంతోనే శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం





-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- మెదక్‌లో ఘనంగా ప్రారంభమైన యువజన క్రీడా, పర్యాటక వారోత్సవాలు
-ఉత్సాహంగా సాగిన 5కే రన్..
జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

**మెదక్ జిల్లా,-18మే (మహాప్రభ )**
99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల మరియు పర్యాటక వారోత్సవాల సందర్భంగా.. జిల్లా యువజన,క్రీడా శాఖ ఆధ్వర్యంలో మెదక్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి ధ్యాన్చంద్ స్టేడియం వరకు నిర్వహించిన 5కే రన్ ను అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, ,జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు క్రీడాభిమానులు, తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ధ్యాన్చంద్ చౌరస్తా వరకు సాగిన ఈ రన్ అనంతరం... నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి, పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడానికి మరియు స్థానిక పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడానికి క్రీడా మరియు పర్యాటక వారోత్సవాలను జిల్లా మండల స్థాయిలలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మెదక్ జిల్లాలో చూడ చక్కని పర్యాటక ప్రాంతాలకు నెలవుగా. టూరిజం స్పాట్ గా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో జిల్లా పాలనను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ముఖ్యంగా యువత దైనందిక జీవితంలో మానసిక, శారీరక, ఆరోగ్యానికి, పరిరక్షణకై అందరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ...ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ ప్రక్రియ..మన శారీరక ఓర్పును, మానసిక దృఢత్వాన్ని పరీక్షించే ఒక గొప్ప క్రీడాంశమని తెలిపారు. స్ట్రాటజీ, వేగం, ఎనర్జీని ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు మనకు చాలా ఉపయోగమని...అలాగే మనలో క్రమశిక్షణ, ఓర్పును పెంపొందుతాయన్నారు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించి, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడమే కాకుండా...మానసిక ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ భారతదేశ శక్తివంతమైన దేశంగా ఉన్నదని విస్తీర్ణంలో ఖనిజ సంపద, అడవి సంపద తో పోలిస్తే వీటికి భిన్నంగా ప్రపంచంలో భారత దేశంలో యువశక్తి అత్యధికంగా కలదని యువత అధిక సంఖ్యలో ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు మెదక్ పట్టణంలో ఏ ర్యాలీ చేపట్టిన యువశక్తిని చాటాలన్నారు. ప్రతిరోజు యువత వ్యాయామాన్ని అలవర్చుకుని శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటూ పెద్దలను గౌరవిస్తూ నేటి యువతే రేపటి భారీ భారత పౌరులు అనే నినాదంతో సమాజంలో ఉన్నత స్థానాలలో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు..ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ ఇంత ఘనంగా 5ని రన్ కార్యక్రమం నిర్వహించినందుకు యువజన క్రీడల నిర్వహణ శాఖ యంత్రాంగాన్ని అభినందించారు. యువత జట్టుగా క్రీడలలో పాల్గొనడం ద్వారా స్నేహభావం పెంపొందడంతో పాటు ఈర్ష్య దేశాలను పక్కనపెట్టి క్రమశిక్షణ గల జీవనశైలి వారికి అలవరుతుందని క్రీడాకారులకు నెలవు అనే నినాదంతో క్రీడాకారులకు క్రీడలలో తర్ఫీదునిస్తూ మండల జిల్లా రాష్ట్రస్థాయిలలో మెదక్ జిల్లా క్రీడాకారులు రాణిస్తున్నారంటే దానికి నిదర్శనం వ్యాయామ ఉపాధ్యాయులేనని కొని ఆడారు.ఈ కార్యక్రమంలో యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మధు సూదన్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, చంద్రమోహన్, వినోద్, మనోహర్, దేవేందర్ రెడ్డి. యన్.సి.సి. క్యాడెట్స్, క్రీడాకారులు యువకులు సుమారు 300 లకు పైగా పాల్గొన్నారు.

# ఖిల్లా దుర్గం నుండి 2కే రన్ విజయవంతం



**దేవరకొండ మే 18 ( మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం దేవరకొండ ఖిల్లా దుర్గం నుండి దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారుల తో పాటు డివిజన్ స్థాయి పీఈటీలు వివిధ శాఖల అధికారులు తో కలిసి 2కే రన్ నిర్వహించారు .ఆరోగ్యంపై పై మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి ప్రతిరోజు యోగా తో పాటు రన్నింగ్ వాకింగ్ సాధన చేసి ఆరోగ్యాలను కాపాడుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు పీడీలు పిఈటిలు కౌన్సిలర్లు, ఎంపీడీవో డానియల్ ఎన్విటి మునిసిపల్ ఫారెస్ట్ ఐ సి డి ఎస్ సిడిపిఓ చంద్రకళ, సూపర్వైజర్ డి. చిట్టెమ్మ, అంగన్వాడీ టీచర్స్,వి. పద్మ, ప్రభావతి, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు

# నల్గొండ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం



**దేవరకొండ మే 18 (మహాప్రభ )**
నల్లగొండ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు చేయాలంటూ,, నల్లగొండ కలెక్టరేట్ ముందు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నా లో పాల్గొని, జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి =ా ప్రవీణ్ కుమార్, బిఆర్ ఎస్ పార్టీ నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ,మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్, ఎన్.భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహా రెడ్డి, కృష్ణా రెడ్డి, రేగట్టే మల్లికార్జున రెడ్డి, ప్రసన్నరాజ్, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ మందడి సైదిరెడ్డి గారు తదితరులు

# రామాయంపేట లో బిఆర్ఎస్,బిజెపి పార్టీలకు భారీ షాక్

-తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు.



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ ).**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 7 వ వార్డు లో బిఆర్ఎస్,బిజెపి పార్టీలకు చెందిన నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.మైనంపల్లి హనుమంతరావు మరియు మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి , రామాయంపేట పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, మండల అధ్యక్షుడు బందారు మహేందర్ రెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాకి స్వామి, చిలుక స్వామి , ఎనిశెట్టి అశోక్ , యాద నాగరాజు , మోబిన్ తో పాటు 7 వ వార్డు కౌన్సిలర్ గజవాడ లావణ్య నాగరాజు గుగులోతు రవి, దేవుని రంజిత్ కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి,డి సి సి కార్యదర్శి పోచమ్మల గణేష్ మరియు గొల్లిపర్తి సీనియర్ నాయకులు సత్యం , యాదగిరి ,పచ్చంటి రాము, పరశురాములు , నరేష్ తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిఖా వేడుకలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ**
నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్ కుమార్తె నిఖా వేడుక సోమవారం రాంపూర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం లావణ్య రెడ్డి, నిజాంపేట్ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్ లు బాపు రెడ్డి,బాదే.చంద్రం మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్,నాయకులు రంజిత్ గౌడ్, సదా శివ లింగం,శ్రీకాంత్ గౌడ్, నగేష్,విజయ్, ఎల్లం యాదవ్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

-తూప్రాన్ 16 వ వార్డులో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన కౌన్సిలర్ బొడ్డు జోష్నా వేణు
-పేద కుటుంబాల్లో ఆర్థిక భారం పడకుండా కల్యాణ లక్ష్మి షాది ముబారక్
-సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
-కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధారణ కుటుంబాలకు మెరుగుదల



**తూప్రాన్ మే 18,(మహాప్రభ)**
తూప్రాన్ పట్టణ పరిధిలోని 16వ వార్డులో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన కౌన్సిలర్ బొడ్డు జోష్ణ వేణు మాట్లాడుతూ పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుంది వార్డులో అర్హులైన లబ్ధిదారులకు 8 మందికి ఇంటింటికి వెళ్లి ఒక్కొక్కరికి లక్ష నూట పదహారు రూపాయల చెక్కులను అందజేశారు ప్రభుత్వం పేద కుటుంబాలో ఆర్థిక భారం పడకుండా కల్యాణ లక్ష్మి షాది ముబారక్ సకాలంలో చెక్కులను చెల్లించి ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా పెద్దపీట వేసిందన్నారు ఇందిరమ్మ ఇల్లు సంక్షేమంలో ఒక భాగమే కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధారణ కుటుంబాలు ఆర్థిక మెరుగుదలను పుంజుకుంటాయన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సేవలు అందేలా కృషి చేస్తుందని తెలిపారు


# జాతీయ స్థాయి రాణించి కబడ్డీ క్రీడాకారిణి బానోతు ఉష



**గాంధారి మే 18 (మహాప్రభ)**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాంధారి మండలం పెట్ సంగం లో పదవ తరగతి పూర్తి చేసి పలు సార్లు రాష్ట్ర స్తాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఎస్జీఫ్ జాతీయ స్థాయిలో తెలంగాణ కు ప్రాతినిధ్యం వహించిన బానోత్ ఉష, కి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాల్లో బాగంగా క్రీడల్లో జాతీయ స్థాయి రాణించి నందుకు కబడ్డీ క్రీడాకారిణి బానోతు ఉష కు పది వేల రూపాయలతో పాటు ప్రశంస పత్రం శాలువ తో సన్మానించారు. జిల్లా విద్యాధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థికి హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం పరిశీలిస్తాం.

-ప్రజావాణిలో వినతులు స్వీకరించిన మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారునితో స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఎస్పీ తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరుగుతోందని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగవద్దు.

-లారీల అన్లోడింగ్ ప్రక్రియ వేగంగా జరగాలి.
-కొనుగోలు కేంద్రంలో తనిఖీ.
-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ )**

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరుగుద్దని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో ఉన్న నాగేంద్ర, మహాదేవ్ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం అన్లోడింగ్ ను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తనిఖీలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో చేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా,-18మే (మహాప్రభ )**

సోమవారం ఐడిఓసి కార్యాలయంలోని ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 101 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రజావాణిలో భూభారతి 52, ఇందిరమ్మ ఇల్లు ఎనిమిది పెన్షన్లు 9 ఇతర 32 దరఖాస్తుల స్వీకరించారు. ప్రజలు నుండి స్వీకరించిన సమస్యల దరఖాస్తులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పిసిఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డి ఆర్ డి ఏ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహావీర్ జెనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్.





**కొత్తపేట 18 మే (మహాప్రభ)**

కొత్తపేట నుండి నాగోల్ కి వెళ్లే ప్రధాన రహదారిలో నూతన మహావీర్ జెనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జెనరిక్ మెడికల్ స్టోర్స్ సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సాధారణ మరియు మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరల్లో నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులోకి రావడం పెద్ద ఊరటనిస్తుందని పేర్కొన్నారు. స్టోర్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులు శ్రీనివాస్ రావు పవన్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు కొత్త తిరుమల , వెంకట్ రెడ్డి , శరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిని మరింత పకడ్బందీగా అమలు చేయాలి.

--ప్రజలకు మరింత చేరువలో డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి.
--రాష్ట్రస్థాయి ప్రజావాణి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాకేష్ రెడ్డి.



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ ).**

ప్రజావాణిని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజలకు చేరువలో డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి పటిష్ఠంగా అమలు చేయాలని అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్నీ సందర్శించారు. అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో ప్రజావాణి బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి మరిన్ని కౌంటర్లు పెంచాలని, ప్రజావాణి లో కొన్ని చిన్న చిన్న మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించాలని సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయాలన్నారు . ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తు పరిష్కారానికి సంబంధించి శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారం లో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ప్రజావాణి అధికారి శృతి నాయక్ , అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్ డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల 'యువ టూరిజం క్లబ్' పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ )**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల నేపథ్యంలో...పర్యాటకశాఖ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా... సోమవారం కలెక్టరెట్ లోని ప్రధాన సమావేశ హాల్ లో...99 రోజుల కార్యచరణ ప్రణాళికను, యువ టూరిజం క్లబ్స్ కార్యచరణ పైన రూపొందించిన పోస్టర్ ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా... మే 18 నుండి 23 వరకు పర్యాటక వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఈ వారోత్సవాల లో భాగంగా...తెలంగాణ సంస్కృతి,



చారిత్రక వారసత్వం, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంగా కొనసాగుతాయన్నారు ఈ ఆరు రోజుల పాటు జిల్లా లోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల వద్ద హెరిటేజ్ వాక్‌లు, స్వచ్ఛత కార్యక్రమాలు, సెమినార్లు, నిర్వహించనున్నారన్నారు పాఠశాలలో, కళాశాలలో పర్యాటక అవగాహన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధంగా యువ టూరిజం క్లబ్స్ ఏర్పాటు,పర్యాటక అవగాహన సదస్సులు నిర్వహించి..విద్యార్థులను జూనియర్ టూరిజం అంబాసిడర్లుగా నామినేట్ చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ , అంబదాస్ రాజేశ్వర్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ , తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలోని చేనేత సహకార సంఘాల తుది ఓటర్ల జాబితా విడుదల ఎం సాగర్.



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ )**

మెదక్ జిల్లాలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా, అర్హులైన ఓటర్లతో కూడిన తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయబడిందని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు (ఎ డి )ఎం సాగర్ ఒక ప్రక ట నలో తెలిపారు.

సభ్యత్వాల ఖరారు: సంబంధిత సహకార సంఘాలకు చెందిన సభ్యుల వివరాలు మరియు అర్హతా ప్రమాణాలను సహాయ సంచాలకులు(ఎ డి )స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, తుది సభ్యత్వ జాబితాను అధికారికంగా ఆమోదించారు.

**సవరణల పూర్తి:** గతంలో విడుదల చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలు, పేర్ల సవరణలు మరియు చేర్పులను పరిష్కరిస్తూ, నిబంధనలకు కట్టుబడి ఈ జాబితాను రూపొందించారు.

**జాబితా ప్రదర్శన:** సభ్యుల సమాచారం కోసం, ఈ ఖరారైన వివరాలను మెదక్ లోని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై, అలాగే సంబంధిత ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఎన్నికల అధికారులకు ప్రతిపాదనల సమర్పణ: ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు, సహాయ సంచాలకులు (ఎ డి )స్థాయిలో ఆమోదించబడిన ఈ తుది ప్రతిపాదనలను వీలైనంత త్వరగా రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులకు సమర్పిస్తామని ఆ అధికారి స్పష్టం చేశారు. తదుపరి ఎన్నికల ప్రక్రియ మొత్తం ఈ తుది జాబితా ఆధారంగానే నిర్వహించబడుతుందని నొక్కిచెప్పిన సహాయ సంచాలకులు, అర్హులైన సభ్యులందరూ ఈ ప్రకటనను గమనించాలని కోరారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**గాంధారి, మే 18 (మహాప్రభ)**



ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని గాంధారి మండలం చద్మల్ తండాలో సోమవారం పీఏసీఎస్ ఛైర్మన్ సాయి కుమార్, సర్పంచ్ బస్సీ దేవిసింగ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తమ పంటను మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, పెద్దలు తదితరు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి..



**మెదక్ జిల్లా -18మే (మహాప్రభ )**

మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్ గ్రామంలో సోమవారం శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాలలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. అనంతరం నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు జాతరలు ప్రతీకలని అన్నారు. నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో జాతర ఉత్సవాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జాతరను జరుపుకోవడం సంతోషకరమన్నారు. రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ జాతర కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పద్మ దేవేందర్ రెడ్డికి మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం. అంజగౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య,, గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్య గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ బండామీది దుర్గయ్య, మాజీ సర్పంచ్ గట్టయ్య, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ అశోక్, ముష్టి పెద్ద గంగయ్య,, రాజల్ పేట గట్టయ్య మంగలి ఆంజనేయులు, శాకానోళ్ల అంజయ్య,,శ్రీధర్ రెడ్డి,,మెదక్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎంబిపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమ సంఘంలో వోడ్నాల లతకు కీలక బాధ్యతలు

**పెద్దపల్లి, -18మే (మహాప్రభ )**

జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఈసీ మెంబర్‌గా పెద్దపల్లి జిల్లాకు చెందిన వోడ్నాల లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.హన్మకొండ ఆదర్శ లా కాలేజీలో జరిగిన రాష్ట్ర ప్రథమ సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగంటి రాజుతో కలిసి వోడ్నాల లతను రాష్ట్ర కార్యదర్శి, ఈసీ మెంబర్‌గా ప్రకటించారు.ఈ సందర్భంగా లత మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం పోరాటం చేస్తానని, జర్నలిస్టులను ఐక్యం చేసి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.జర్నలిస్టుల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని వోడ్నాల లత స్పష్టం చేశారు.

# బిజినెస్

## ఐడిబిఐ బ్యాంక్ విక్రయానికి మళ్లీ కసరత్తు..!




**న్యూఢిల్లీ**

ఐడిబిఐ బ్యాంక్‌ను ప్రయివేటు లేదా విదేశీ సంస్థలకు విక్రయించడానికి కేంద్ర ఆర్థిక శాఖ మరోమారు కసరత్తు చేస్తోందని సమాచారం. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన బిడ్‌లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నిలిచిపోయిన ఐడిబిఐ బ్యాంక్ మెజారిటీ వాటా విక్రయ ప్రక్రియను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు కనీస రిజర్వ్ ధరను 20 శాతం వరకు తగ్గించడంతో పాటు, బ్యాంక్ రోజువారీ షేర్ మార్కెట్ ధరపై కాకుండా దాని అంతర్గత విలువ ఆధారంగా ధరను నిర్ణయించాలని అధికారులు భావిస్తున్నారు. గత మార్చిలో బిడ్‌లు రద్దయిన ఈ ప్రక్రియలో కెనడియన్ బిలియనీర్ ప్రేమ్ వత్సకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, ఎమిరేట్స్ ఎన్‌బిడి రేసులో నిలవగా, వాల్యుయేషన్ ఎక్కువగా ఉండటంతో కోటక్ మహీంద్రా బ్యాంక్ వెనుకడుగు వేసింది. ఐడిబిఐ బ్యాంక్‌లో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, ఎల్‌ఐసిలకు కలిసి దాదాపు 95 శాతం వాటాలున్నాయి. అందులో మెజారిటీ 60.7 శాతం ఉమ్మడి వాటాను విక్రయించాలని యోచి స్తున్నాయి. ఈ ప్రయివేటీకరణ ప్రక్రియను ఎలాగైనా ముందుకు తీసుకెళ్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త బిడ్లను ఆహ్వానించే యోచనలో అధికారులు ఉన్నారు.

## దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు..

బంగారం, వెండి ధరలు శుభవార్త చెబుతున్నాయి. గత నాలుగు రోజుల కిందట ఒక్కసారిగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. తాజాగా మే 18వ తేదీన కూడా తగ్గుముఖం పడుతున్నాయి. దేశీయంగా తులం బంగారం ధర రూ.1,56,920 ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగచ్చు.

హైదరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

విజయవాడ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

ఢిల్లీ -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,070 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,990 వద్ద కొనసాగుతోంది.



ముంబై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

చెన్నై -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,47,490 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

కోల్‌కతా -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,840 వద్ద కొనసాగుతోంది.

## ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు..!

: ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు ఇతర ఆర్థిక సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీచేసింది. ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని సోమవారం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతోపాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టంచేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి దిగ్గజ సంస్థలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి.కేంద్ర ఆర్థిక సేవల విభాగం తాజా ఉత్తర్వులు జారీచేసింది. అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని కేంద్రం



సూచించింది. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితి పాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొన్నది. వీటితోపాటు ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలవల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి మోదీ గతవారం పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతలవల్ల దేశ ఆర్థికవృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే భారత కరెన్సీ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సౌకర్యాన్ని కూడా కల్పించాయి.

# స్పోర్ట్స్

## కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తి పాదానికి గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర




విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉన్నతాధికారులు మరియు నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. వరుణ్ చక్రవర్తి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు ( లో ఉన్న ఆటగాడు. బోర్డు నిబంధనల ప్రకారం.. కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు ఐపీఎల్ సమయంలో ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేదా గాయాలు తలెత్తినా ఫ్రాంచైజీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గాయం తీవ్రతను దాచిపెట్టి లేదా నొప్పిని భరిస్తూ ఆటగాళ్లను మైదానంలోకి దించడం నిబంధనలకు విరుద్ధం. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్ల 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'ను పర్యవేక్షించే బాధ్యత ఎన్‌సీఏ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ వరుణ్ చక్రవర్తి శారీరక ఫిట్‌నెస్‌ను నిర్లక్ష్యం చేయడంపై బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు అంతర్గత సమాచారం.బీసీసీఐ జోక్యం చేసుకోవడం మరియు బోర్డు నుండి గట్టి హెచ్చరికలు రావడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి పాదానికి తగిలిన గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు, అతనికి రాబోయే కొన్ని మ్యాచ్‌ల పాటు పూర్తి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో కేకేఆర్ ఆడబోయే తదుపరి కీలకమైన మ్యాచ్‌కు వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ ఎలెవన్ (తుది జట్టు) కు దూరం కావడం దాదాపు ఖాయమైంది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతున్న తరుణంలో తమ ప్రధాన వికెట్ టేకింగ్ స్పిన్నర్ గాయం బారిన పడటం, అది వివాదాస్పదంగా మారడం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి.

## ఆగస్టులో శ్రీలంకకు టీమిండియా.. టీ20 సిరీస్‌పై స్పష్టత వచ్చేనా..!



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా భారత జట్టు ఆగస్టులో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. లంక గడ్డపై రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది టీమిండియా. ఆగస్టు రెండో వారం నుంచి ఇరుజట్లు తలపడుతాయని సమాచారం. అయితే.. ఇప్పటివరకూ శ్రీలంక క్రికెట్ షెడ్యూల్‌ను ప్రకటించలేదు. మొత్తంఆ రెండు వారాల్లో సిరీస్ నిర్వహించాలని లంక భావిస్తోంది. ఆగస్టు 15 నుంచి 27 మధ్య మ్యాచ్‌లు ఉంటాయని క్రిక్‌బజ్‌తో బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ వెల్లడించాయి.లంక ప్రీమియర్ లీగ్ అనంతరం భారత్, లంక మధ్య సిరీస్ జరుగనుంది. ఎల్‌పీఎల్ ఆగస్టు 9న ముగియనుంది. అంటే.. ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్ షురూ కానుంది. అలానే ఇరుజట్ల మధ్య పొట్టి సిరీస్‌పై కూడా స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. అవినీతిమయమైన లంక బోర్డును ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే రద్దు చేశారు. ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ బాధ్యతలు చూసుకుంటోంది.

దాంతో.. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఈమధ్యే ఐసీసీ ప్రతినిధిగా లంకకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించాడు. ఈ క్రమంలోనే నిరుడు దిత్వా తుఫాన్ బాధితుల కోసం నిధుల సమీకరణకు భారత్, శ్రీలంక మధ్య మూడు టీ20ల సిరీస్‌పై చర్చించినట్టు సమాచారం.

**జూన్ 6 నుంచి**

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ మే 31న ముగియడంతో.. జూన్ 6న భారత జట్టు అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ముల్లన్‌పూర్‌లో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టులో ఆపై.. మూడు వన్డేల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సేన తలపడనుంది. అనంతరం ఐర్లాండ్, ఇంగ్లండ్, జింబాబ్వే పర్యటనల అనంతరం శ్రీలంకకు టీమిండియా వెళ్లనుంది.

## రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు

ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్ కు డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖెల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు.రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో



తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా..” అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు. ఎడమచేతి స్పిన్ బౌలర్ కావడం వల్ల పరుగులను కూడా కట్టడి చేసేవాడని వివరించారు.రియాన్ పరాగ్ కెప్టెన్సీని కూడా మైఖేల్ వాన్ తప్పుబట్టారు. ఢిల్లీ ఛేజింగ్‌లో 18వ ఓవర్‌లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ డొనోవన్ ఫెరీరాను బౌలింగ్‌కు దించడాన్ని వాన్ విమర్శించారు. “డొనోవన్ ఫెరీరాను బౌలింగ్ చేయించిన వ్యూహాత్మక నిర్ణయాన్ని నేను ప్రశ్నించాల్సిందే. ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని భావించి పార్ట్‌టైమ్ ఆఫ్-స్పిన్నర్‌ను ప్రవేశపెట్టారా? అది గొప్ప నిర్ణయం కాదు, అనవసరం.. అని వాన్ అన్నారు.




# శివకార్తికేయన్, కమల్ హాసన్ సినిమా షురూ..

## హైప్ పెంచుతోన్న లుక్

తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న కోలీవుడ్ స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు శివ కార్తికేయన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ అదిరిపోయే న్యూస్‌తో అభిమానుల ముందుకొచ్చాడు. ఈ సారి ఏకంగా ఉలగనాయగన్ కమల్ హాసన్‌తో సినిమా చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. శివకార్తికేయన్ నటిస్తోన్న తాజా చిత్రం Seyon. శివకుమార్ మురుగేశన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం లార్డ్‌మురుగన్ మైథాలజీ బ్యాక్ డ్రాప్ కథ స్ఫూర్తిగా రానుంది. నుదుట పసుపు బొట్టు, మధ్యలో కుంకుమ తిలకం, మెడలో రుద్రాక్ష, బంతిపూల దండతో కనిపిస్తున్న శివకార్తికేయన్ ఓ చేతిలో కాగడా, మరో చేతిలో గంటను పట్టుకున్న లుక్స్ ఇప్పటికే సినిమాపై హైప్ పెంచుతున్నాయి. ఈ మూవీ షూటింగ్ నేడు మొదలైంది. ప్రస్తుతం చెన్నైలో ఈ మూవీ మొదటి షెడ్యూల్ కొనసాగుతుంది. దీని తర్వాత శివకార్తికేయన్ టీం నెక్స్ట్ షెడ్యూల్ కోసం పలు లొకేషన్లకు వెళ్లనుంది. ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలా శరవణన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

# హీరోయిన్లు సీరియస్‌రిలేషన్‌షిప్‌లలో ఉండకపోవడానికి ఇదే కారణం

## ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన కాజల్

సినీ పరిశ్రమలో హీరోయిన్ల వ్యక్తిగత జీవితం, ప్రేమ వ్యవహారాలు, రిలేషన్‌షిప్‌ల గురించి ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్లు ఎందుకు ఎక్కువగా సీరియస్ రిలేషన్‌షిప్‌లలో కనిపించరనే ప్రశ్నకు స్టార్ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, సినీ నటీమణుల జీవనశైలి కారణంగానే అలాంటి పరిస్థితులు ఎదురవుతాయని తెలిపారు.హీరోయిన్లు తమకు క్రష్‌లు ఉన్నాయని చెబుతుంటారు. అయితే సీరియస్ రిలేషన్‌షిప్‌లో లేమని లేదా బాయ్‌ఫ్రెండ్ లేరని చెప్పడం గురించి యాంకర్ ప్రశ్నించగా, కాజల్ స్పందిస్తూ అది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు.అయితే ఒక హీరోయిన్‌గా ఆ పరిస్థితిని తాను బాగా అర్థం చేసుకోగలనని చెప్పిన ఆమె, “సీరియస్ రిలేషన్‌షిప్‌లో ఉండకపోవడానికి ప్రధాన కారణం సమయం లేకపోవడమే. షూటింగ్‌లు, ప్రయాణాలు, ప్రమోషన్లు ఇలా నిరంతరం బిజీ షెడ్యూల్ మధ్య వ్యక్తిగత బంధాలకు సమయం కేటాయించడం చాలా కష్టంగా మారుతుంది” అని వివరించారు.తన వ్యక్తిగత జీవితంలో ఉన్న క్రష్‌ల గురించి కూడా కాజల్ సరదాగా స్పందించారు. “ఎదుగుతున్న వయసులో క్రష్‌లు ఉండటం సహజం. నాకు కూడా కాలేజీ రోజుల్లో క్రష్‌లు ఉండేవి. ఆసక్తికర విషయం ఏమిటంటే వారు ఇప్పటికీ నా మంచి స్నేహితులుగానే ఉన్నారు” అని నవ్వుతూ చెప్పారు. కాజల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినీ రంగంలో ఉన్న గ్లామర్ వెనుక నటీనటులు ఎదుర్కొనే ఒత్తిడి, సమయాభావం, వ్యక్తిగత జీవితానికి దూరమయ్యే పరిస్థితులను ఆమె మాటలు ప్రతిబింబిస్తున్నాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.కాగా కాజల్ అగర్వాల్ ప్రేక్షకులకు లక్ష్మీ కళ్యాణం, చందమామ సినిమాల ద్వారా పరిచయమయ్యారు. అనంతరం మగధీర సినిమాతో భారీ గుర్తింపు తెచ్చుకుని స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. దశాబ్దానికి పైగా టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో నటించిన ఆమె, 2020లో వ్యాపారవేత్త గౌతమ్ కిచ్లూను వివాహం చేసుకున్నారు.










# అప్పుడు ఇష్టం లేనిది.. ఇప్పుడు అలవాటైంది..

## వైరల్‌గా మారిన కీర్తి సురేశ్ కామెంట్స్

తొలినాళ్లలో కాస్తంత బొద్దుగా కనిపించిన కీర్తి సురేశ్, ఉన్నట్టుండి బాగా తగ్గింది. తను అనూహ్యంగా బరువు తగ్గి కనిపించడంతో ఆపరేషన్లు గట్రా చేయించుకుందంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడారు. సోషల్ మీడియాలో విమర్శలు కూడా ఎదురయ్యాయి. వీటిపై తాజాగా స్పందించింది కీర్తి సురేశ్.ఇప్పటివరకూ నా ఫిట్‌నెస్ గురించి ఎవరితో మాట్లాడలేదు. మొదట్లో జిమ్ అనేది నాకు సంబంధించింది కాదు, నా శరీరానికి వ్యాయామం అవసరం లేదు అనే ధోరణిలో ఉండేదాన్ని. కానీ ‘మహానటి’ తర్వాత వచ్చిన గ్యాప్, నా గురించి నేను ఆలోచించుకునే అవకాశాన్నిచ్చింది. వర్కవుట్లు మొదలుపెట్టి కేవలం 9 నెలల్లో పది కేజీలు తగ్గాను. లావుగా ఉంటానంటూ నన్ను బాడీ షేమింగ్ చేసినవారందరికీ సరైన సమాధానం ఇచ్చాను. ఒకప్పుడు జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఇప్పుడు జిమ్ చేయకపోతే ఏదోలా ఉంటుంది. ఇది అలవాటుగా మారడం బావుంది. ఒకప్పుడు చీరలోనే అందంగా ఉండేదాన్ని. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలొస్తున్నాయ్’ అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.

# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

## రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత

నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.

# టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

## కారణాలను వెల్లడించిన హీరో యశ్



యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ సినిమాను ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. మొదట సినిమాను మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాతే డిస్ట్రిబ్యూషన్ గురించి మాట్లాడుకుంటాం. ప్రస్తుతం నేను సినిమా విడుదల ప్రణాళికల పనుల్లోనే ఉన్నాను. ఈ పద్ధతి కచ్చితంగా అభిమానులకు నచ్చకపోవచ్చని అన్నారు. మొదట ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయాలని భావించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూన్ 4కు వాయిదా వేశారు. తర్వాత ఈ తేదీకి కూడా రావడం లేదంటూ యశ్ పోస్ట్ పెట్టారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయిందని ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి రిలీజ్ చేయాలనే ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com